ప్రజాశక్తి
బుధవారం 20 సెప్టెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

పౌర హక్కుల ఉల్లంఘన తగదు

- టిడిపి శ్రేణుల అరెస్టుపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి -పాడేరు: పౌర హక్కుల ఉల్లంఘన వైసిపి ప్రభుత్వానికి తగదని, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను విడనాడాలని సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్పలనర్స మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ విజయవాడలో నిరసన ప్రదర్శన చేయకుండా ఆ పార్టీ శ్రేణులను అడ్డుకోవడం, రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులను గృహ నిర్బంధం చేసి అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.కాలినడకన వెళ్ళి నిరసన తెలిపే హక్కును కూడా నిరాకరించడం, అరెస్టులు చేయడం పౌరహక్కులను ఉల్లంఘించడమేనన్నారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, రాజ్యాంగం కల్పించిన నిరసన తెలియజేసే హక్కును అణచివేసే నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలకు స్వస్తి పలకాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు.

ఉక్కు రక్షణ బైక్‌యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

25, 26 తేదీల్లో అల్లూరి జిల్లాలో యాత్ర

ఐటిఐ విద్యార్థులతో పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న సిపిఎం నేత చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి పాడేరు :మోడీ విధానాలతోనే ప్రభుత్వరంగ సంస్థలు పతనమవుతున్నాయని, తమ భవిష్యత్తుపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఉత్తరాంధ్ర ఆరుజిల్లాలు 1050కిలోమీటర్లు నిర్వహించే బైక్ యాత్ర వాల్ పోస్టర్లను చింతపల్లి ఐటిఐ విద్యార్థులతో ఆవిష్కరణ చేయించారు. అనంతరం చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ .ఐటిఐ .పాలిటెక్నిక్. కోర్సులు చదివి ప్రభుత్వ ఉద్యోగుల కోసం వేలాదిమంది ఎదురు చూస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తే ప్రైవేటు ఉద్యోగాలు తప్ప ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని యువత ఆందోళన చెందుతున్నారన్నారు. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని యువత పెద్ద ఎత్తున పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఉక్కు రక్షణ బైక్‌యాత్ర ఈనెల 25, 26 తేదీల్లో అల్లూరు జిల్లాకు రానుందని, కార్యక్రమం జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి మజ్జి రాంబాబు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీవన్‌కృష్ణ ,ఐటిఐ విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'గడపగడపకూ' పనులు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : గడప గడపకు మన ప్రభుత్వంలో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, పాడేరు నియోజ వర్గం పరిధిలోని ఎంపిడిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 58పనులు పూర్తి చేసి రూ. 1 కోటి 35 లక్షల బిల్లులు చెల్లించామన్నారు. 119 నులు పురోగతిలో ఉన్నాయన్నారు.

నీటి సరఫరా విభాగం పరిధిలో 19 పనులను పూర్తి చేసి రూ.47 లక్షల 65 వేల బిల్లులను చెల్లించామని స్పష్టం చేసారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రతీ పంచాయతీలో రూ.40 లక్షల విలువైన పనులు చేయడం జరుగుతుందన్నారు. మంజూరు చేసిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేస్తే వెంటనే బిల్లులు విడదల చేస్తామని చెప్పారు. పనులపై సర్పంచులు నిఘాపెట్టి సకాలంలో పూర్తి చేసే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. రూ.5 లక్షల విలువైన పనులకు నామినేషన్ విధానంలో పనులు చేయాలని చెప్పారు. రూ.5 లక్షల పైబడిన పనులకు టెండర్లు పిలిచి పనులు చేయాలని అన్నారు. జాప్యం లేకుండా బిల్లులు చెల్లిస్తామన్నారు. ప్రాధాన్యత, ప్రాధాన్యేతర పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.. తాగునీటి పథకాలు వేగంగా పూర్తి చేసి దాహార్తిని తీర్చాలని సూచించారు. పనులు చేయడానికి బయపడొద్దని బిల్లులు వస్తాయని స్పష్టం చేసారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 97 సచివాలయాలలో 85 సచివాలయాలను పూర్తి చేసారన్నారు. మిగిలిన 12 పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు మండల సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడం లేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. భవనాలు లేని పాఠశాలలకు భవన నిర్మాణాలకు, వాలంటీర్ల నియామకాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.సమావేశంలో ఐటిడిఎ పిఒ వి. అభిషేక్, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలాకృష్ణ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇఇలు, ఎఇఇలు, ఐదు మండలాల ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- ఆలస్యంగా వెలుగులోకి..

- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటున్న బంధువులు, తోటి విద్యార్థులు

కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం, సిఐటియు నేతల డిమాండ్

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని యు.చీడిపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న కిల్లో వంశీకృష్ణ అనారోగ్యంతో ఈ నెల 14న మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి మృతుని బంధువులు, తోటి విద్యార్థుల తెలిపిన వివరాలు ప్రకారం... మండల కేంద్రానికి 30 కిలోమీటర్లు దూరంలో మూరుమూల ప్రాంతంలో యు.చీడిపాలెం గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రెండు వారాల క్రితం ఆ గ్రామంలోని పిహెచ్‌సిలో వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వంశీకృష్ణకు అప్పటికే జ్వరంతో పాటు పచ్చకామెర్లు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించి మెరుగైన వైద్యం నిమిత్తం మైదాన ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు. కాని పాఠశాల వార్డెన్ పట్టించుకోలేదు. కనీసం తల్లిదండ్రులకు సమాచారం కూడా ఇవ్వలేదు. ఈ నెల 13న తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న వంశీకృష్ణను పాఠశాల ఉపాధ్యాయుడు పిహెచ్‌సికి తీసుకెళ్లగా, మైదాన ప్రాంతానికి తక్షణమే తరలించాలని మళ్లీ సూచించారు. అప్పుడు కూడా తీసుకెళ్లలేదు. వంశీకృష్ణ అనారోగ్యంతో ఉన్నాడని, వెంటనే వచ్చి తీసుకెళ్లాలని 14వ తేదీన ఉదయం సదరు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు బయలుదేరారు. ఇంతలోనే వంశీకృష్ణ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా, మార్గమధ్యలో చనిపోయాడు. ఆ దారిలోనే తల్లిదండ్రులకు వంశీకృష్ణ మృతదేహాన్ని అప్పగించారు. పాఠశాల హెచ్‌ఎం కమ్ వార్డెన్‌గా ఉన్న మిరియాల రాజు పాఠశాలలో ఎప్పుడూ సరిగా అందుబాటులో ఉండటం లేదని, ఆయన నిర్లక్ష్యం కారణంగానే వంశీకృష్ణ మృతి చెందాడని బంధువులు, తోటి విద్యార్థులు ఆరోపించారు.

బాలుడు వంశీకృష్ణ మృతదేహం

వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

హెచ్‌ఎం కమ్ వార్డెన్ మిరియాల రాజు పట్టించుకోకపోవడం వల్లే వంశీకృష్ణ మరణించాడని, వార్డెన్‌ను కఠినంగా శిక్షించాలని, మృతుని కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.సూరిబాబు, జె.పెంటయ్య, పాంగి గంగరాజు, సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాల్సిన వార్డెన్ల నిర్లక్ష్యం కారణంగా మన్యంలో తల్లిదండ్రులు తమ బిడ్డల శవాలను చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం ఉండటం లేదని ఆరోపించారు. దీనికి ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వర్కర్లను నియమించాలని అనేక సార్లు ప్రభుత్వానికి, ఐటిడిఎ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రజా సంఘాల నాయకులను హాస్టళ్ల లోపలకు అనుమతించకపోవడంతో, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్లు, సిబ్బందికి భయం లేకుండా పోయిందని, వారేమి చేసినా బయటకు తెలియడం లేదని పేర్కొన్నారు. దీంతో వారు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే పిల్లలు, వారి తల్లిదండ్రులు, ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ఎన్నాళ్లీ డోలీ మోతలు

అధ్వాన రహదారులతో అత్యవసర వైద్యానికి అవస్థలు

రమేష్‌ను డోలీలో మోసుకెలుతున్న కుటుంబీకులు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: స్వాతంత్రం వచ్చి దశబ్దాలు గడుస్తున్నా ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలకు డోలిమోతలు తప్పడం లేదు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడంతో అనారోగ్యానికి గురైన వారిని వైద్య సేవలు అందించాలంటే వాహన సౌకర్యం లేక డోలీలతో గిరిజనులు మోసుకెళ్లాల్సిన దారుణమైన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి సంఘటనలు పదేపదే పునరావృతమౌతున్నా, ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు.

స్థానిక మండలంలోని గసభ పంచాయతీ సిమిలిగూడ గ్రామానికి చెందిన గెమ్మెలి రమేష్ అనారోగ్యానికి గురవ్వడంతో వారి కుటుంబీకులు మంగళవారం డోలి మోతతో మోసుకొని ఆస్పత్రికి తరలించారు. సిమిలిగూడకు నిర్మించిన మట్టి రోడ్డు అధ్వానస్థితిలో ఉండడంతో వాహనరాకపోకలకు వీలులేని స్థితి ఉంది. బురదమయంగా మారిన రోడ్డులో గత్యంతరం లేని పరిస్థితులలో డోలీలోనే రమేష్‌ను మోసుకెళ్లి ఆసుపత్రికి చేర్చారు. ఏటా ఇటువంటి సంఘటనలు అనేకం జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

వెంటనే తారు రోడ్డు నిర్మించాలి

సిమిలిగూడ గ్రామానికి వెంటనే తారు రోడ్డు నిర్మించాలని గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు, ఎమ్మెల్యేకు, ఇంజనీరింగ్ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయక గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందాక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిమిలిగూడ గ్రామానికి ఆనుకుని శిరస్సగుడ గ్రామంలో 60 మంది గిరిజనులు ఉన్నారని, జలుబు దగ్గు జ్వరం వంటి లక్షణాలతో వారు బాధపడుతున్నారన్నారు. తక్షణమే ఆ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జీ మోహన్‌దాస్, గ్రామస్తులు వి శుక్ర పాల్గొన్నారు.

జిసిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి -పాడేరు : ఏజెన్సీలో గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకుల్లో పనిచేసే కార్మికుల వేతన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అల్లూరి జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, పెట్రోల్ బంక్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు వంతల రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరులో జిసిసి డివిజనల్ మేనేజర్‌ను సిఐటియు ఆధ్వర్యంలో కలిసి పెట్రోల్ బంకుల కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు అనంతరం కార్మికులతో సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలో జిసిసి పెట్రోల్ బంకుల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన సుమారు 100 మంది కార్మికులు 2016 నుంచి పనిచేస్తున్నారని, వేతన చెల్లింపులో వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 2016లో రూ.మూడు వేలు వేతనంతో పనిలో చేరిన వీరికి ఎనిమిదేళ్లయినా రూ.8వేలకు మించలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, అవుట్ సోర్సింగ్ పద్ధతిని రద్దుచేసి, వీరిని జిసిసి కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలను చెల్లించడంతోపాటు, ఇఎస్ఐ,పిఎఫ్, బీమా, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే, వచ్చేనెలలో విధులను బహిష్కరించి సమ్మెకు వెళ్లనున్నట్లు హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి దశలవారీగా వివిధ రూపాల్లో నిరసన చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వివిధ మండలాల కార్మిక యూనియన్ ప్రతినిధులు కేశవ, రామన్న, హరిబాబు, భూషణరావు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన డివిఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కనీస సౌకర్యాలు లేక కష్టాలు

గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నేత శంకరరావు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని రంగబయలు పంచాయితీ, పట్నాపడాల్‌పుట్టు గ్రామంలో కనీస సౌకర్యాలను కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు, కొర్ర శంకరరావు కోరారు. మంగళవారం గ్రామంలో పర్యటించి, ప్రజలతో సమావేశమయ్యారుఈ సందర్భంగా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.ప్రధానంగా రోడ్డు, తాగునీటి సమస్యలపై గ్రామస్తులు విన్నవించారు రోడ్డు. సౌకర్యం లేకపోవడం విషజ్వరాల సమయంలో వైద్యానికి వెళ్లాలన్నా, అలాగే గర్భిణుల ప్రసవాలకు ఆసుపత్రికి వెళ్లాలంటే డోలి మోతలే శరణ్యమని, పట్నాపడాలుపుట్ నుండి రంగబయలు వరకు మోసుకెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. దట్టమైన అడవుల మధ్య, లోయ ప్రాంతాల నుండి కొండల నడుమ భుజాలపై మోసి రోగులకు ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రమాదవశాత్తు పాముకాటుకు గురైన వ్యక్తిని, చెట్టుపైనుంచి పడిపోయిన వ్యక్తిని ఆసుపత్రికి డోలీలో మోసుకెళ్లే క్రమంలో మార్గమధ్యలోనే చనిపోయి పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామంలో 8 మంది జ్వరాలతో బాధపడుతున్న రోగులను ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదనతో తెలిపారు. అనారోగ్యానికి గురైన కె.రాధ, కె తులస, కే ఉంగల, కె నీలా, కే డుంబిరి, లక్ష్మి, కె.రుక్మిణిలకు తక్షణమే వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పి సావు, పి సుబ్బారావు, రామకృష్ణ గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

15న బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విఆర్.పురం

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ అక్టోబర్ 15వ తేదీన రంపచోడవరంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని రామవరంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులపై మోయలేని భారాలు వేస్తున్నాయని, పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని పేర్కొన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. అక్టోబర్ 15న జరుగు బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. బహిరంగ సభ విజయవంతానికి గ్రామ గ్రామాన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, నాయకులు పంకు సత్తిబాబు, పడ్లాది రమేష్, ఆసు లక్ష్మయ్య, గుండిపూడి లక్ష్మణరావు, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

కాంట్రాక్టరు నిర్వాకంతో గ్రామాల మధ్య వివాదం

ప్రజాశక్తి-కొయ్యూరు

రోడ్డు కాంట్రాక్టరు నిర్వాకం రెండు గ్రామాల మధ్య వివాదానికి కారణమైంది. ఇటీవల మండలంలోని డౌనూరు పంచాయితీ పరిధి జోడుమామిడి గ్రామానికి నిమ్మలపాలెం గ్రామం నుండి సుమారుగా రూ.70 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. అయితే సదరు కాంట్రాక్టరు అవసరమైనచోట్ల కల్వర్టులు నిర్మించలేదు. దీంతో నిమ్మలపాలెం గ్రామానికి చెందిన రైతుల సాగు భూములకు కాలువ ద్వారా సాగునీరు ప్రవాహానికి ఈ గ్రావెల్ రోడ్డు అడ్డుగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రెండు గ్రామాల మధ్య వివాదం నెలకొంది. అయితే జోడుమామిడి గ్రామస్తులు చొరవ తీసుకుని సొంత ఖర్చులతో అవసరమైన చోట రోడ్డును తవ్వి తూరలు వేశారు. దీంతో తాత్కాలికంగా వివాదం పరిష్కారమైంది. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టరు అసంపూర్తిగా ఉన్న గ్రావెల్ రోడ్డును నాణ్యతగా వేయించాలని, అవసరమైన చోట కల్వర్టులు నిర్మించాలని, రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఇరు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

తూరలు వేయడానికి రోడ్డు తవ్వుతున్న జోడిమామిడి గ్రామస్తులు

రక్తదాత సిఐ సుధాకర్

27వసారి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న సిఐ సుధాకర్

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు పట్టణ సిఐ సుధాకర్ తన మానవత, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వద్ద వెళ్లి రక్తదానం చేస్తున్నారు. ఇప్పటికే 27వ సారి రక్తదానం చేశారు. పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించడంతోపాటు మానవతా దపథంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి ప్రాణదాతగా సిఐ నిలుస్తున్నారని పలువురు అంటున్నారు. పాడేరు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు ఏర్పడిన తర్వాత ఏడుసార్లు పాడేరు పట్టణంలోనే ఆయన రక్తదానం చేశారని అన్నారు . గతంలో విశాఖపట్నం,శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారని తెలిపారు. సిఐ చేస్తున్న రక్తదానాన్ని ఆదర్శంగా తీసుకొని మరింతమంది రక్తం దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

ఎఒబిలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన సిఆర్పిఎఫ్ సివిల్ పోలీసు బలగాలను స్థానిక రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో మొహరించి వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలు సేకరించి విడిచి పెట్టారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో గత అర్ధరాత్రి ఒడిస్సా పోలీసులు రెండు కోట్లు విలువైన గంజాయి స్వాధీనం చేసుకోవడంతో ఆంధ్ర పోలీసు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. గంజాయి అక్రమ రవాణాపై స్థానిక ఎస్సై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం పాత పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి ప్యాకెట్లు పడేయగా, వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

తనిఖీలు చేస్తున్న సీలేరు ఎస్ఐ రామకృష్ణ

చిన్నార్కూరును ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించండి

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ముంపునకు గురవుతున్న మండలంలోని చిన్నార్కూరు గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చిన్నార్కూరు గ్రామంలో పాయం పాపారావు అధ్యక్షతన జరిగిన సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నార్కూరు గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించకపోవడంపై ఐటీడీఏ పీవో దృష్టికి, ఎమ్మెల్సీ అనంతబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. తక్షణమే చిన్నార్కూర్ గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించి ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కుంజా రాధ, సిపిఎం సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ పంచాయతీ కేంద్రంలో పశువైద్యులు డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. 110 ఆవులు, 74 మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువులు లంపి వ్యాధికి గురికావడంతో వ్యాధి నిర్ధారణ చేసి వాటికి సంబంధించిన టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. గిరిజనులు పశువుల సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. వర్షాకాలం కావడంతో పశువులకి అనేక వ్యాధులు సంభవిస్తాయని ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందిస్తే వెంటనే వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

నేడు ముంచంగిపుట్టులో 'జగనన్నకు చెబుదాం'

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి -పాడేరు : ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20 న బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంచంగిపుట్టు మండల ప్రజలు స్పందనలో పాల్గొని సమస్యలపై అర్జీలు సమర్పించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులందరూ 20న ఉదయం 10 గంటలకు ముంచంగిపుట్టులో స్పందన కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

22న డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపిడిఒ ఉషారాణి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే స్పందనలో జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. మండలంలోని గిరిజనులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తే పరిశీలించి, పరిష్కరిస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమావేశమైన కాంగ్రెస్‌నేతలు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బూత్ కమిటీలు, పంచాయతీ కమిటీల ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నిర్ణయించినట్లు ఆగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బొయితిలి మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు వెల్లడించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారావు అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ అభివృద్ధి, ఇతరత్రా విషయాలపై చర్చించినట్లు తెలిపారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

నిర్మాణం పూర్తయిన గుమ్మకోట సచివాలయ భవనం

ప్రారంభానికి సచివాలయ భవనం సిద్ధం

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. స్థానిక సర్పంచ్ పాగి. అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఆయా భవనాల నిర్మాణాలను పూర్తి చేశామని, ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నామన్నారు.

ఆశ్రమ విద్యార్థి మృతి కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం చీడిపాలెం బాలురు ఆశ్రమ పాఠశాలలో నాలుగవ తరగతి విద్యార్థి కిల్లో వంశీకృష్ణ మృతిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి చిన్నారావు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వంశీకృష్ణకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యమే మృతికి కారణమని తెలుస్తోందన్నారు. ఆశ్రమ పాఠశాల వార్డెన్, సిబ్బంది, తోటి విద్యార్థులను విచారించి, వంశీకృష్ణ మృతికి కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఏటా ఎపిడిమిక్ సీజన్‌లో సంక్షేమ హాస్టల్స్, ఆశ్రమాల్లో అనారోగ్యంతో విద్యార్థుల అవస్థలు, మరణాలు సర్వసాధారణంగా మారినా విద్యార్థుల ఆరోగ్యం పట్ల, వైద్యసేవల్లో నిర్లక్ష్యం సరికాదన్నారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వం, అధికారుల్లో ఉన్న చులకన భావం వల్లే జ్వరమరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు .సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపం కూడా కారణమన్నారు. విద్యార్థి మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆశ్రమ హాస్టల్స్‌లో హెల్త్ వాలంటీర్స్‌ను నియమించాలని, రెగ్యులర్‌గా విద్యార్థుల ఆరోగ్యతనిఖీలకు వైద్యశిబిరాలను నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్.మత్యరాజు, పి.సింహాద్రి, మండల నాయకులు వి.మహేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేత చిన్నారావు

ఎస్ఐపై చర్యలకు వినతి

ఎస్‌టి కమిషన్ సభ్యునికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-పెదబయలు: సెల్‌టవర్ నిర్మాణ విషయంలో లక్ష్మీపేట పంచాయతీ మొండికోట గ్రామానికి చెందిన కించెయ్ విజయ్‌కుమార్‌పై చేయిచేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక ఎస్ఐ పులి మనోజ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు ఎస్‌టి కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లానాయకులు బొండా సన్నిబాబు, వైసిపి మండల నాయకుడు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు పాంగి సింహాచలం, బాధితుడు కించెయ్ విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రహరీ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ పక్కనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద రూ.4లక్షల జెడ్‌పి నిధులతో నిర్మిస్తున్న ప్రహరీ పనులను జెడ్‌పిటిసిరేగం మత్స్యలింగం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విగ్రహం రక్షణకు ప్రహరీని నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టి, సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాకూరు నేతలు నైని సత్తిబాబు, కొప్పుల లక్ష్మయ్య, దనసాని మురళి, కిల్లో చిన్నేశ్వరరావు, వైస్ సర్పంచ్ కోడిదాసు. గోవిందరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందక దొర. వెంకట్, పెనుమల వెంకటరావు, బద్నాయిని సూరిబాబు, మాజీ సర్పంచ్ బద్నాయిని బొంజుబాబు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

అన్నసమారాధన

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రంలో రామాలయం వీధి వద్ద నిర్వహించిన వినాయక ఉత్సవాల సందర్భంగా వినాయకుని మండపం వద్ద మంగళవారం సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు అరకు, కించమండ, గుంటసీమ తదితర గ్రామాలతోపాటు అనేక గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గణేషుని ఉత్సవాలను జరుపుకున్నారు.

నేరాలు ఘోరాలు

అదుపు తప్పి మినీ వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి -జి.మాడుగుల : మంగళవారం మండల కేంద్రంలోని వారపు సంతకు వ్యాపారులతో వచ్చిన మినీ వ్యాన్, తిరుగు ప్రయాణంలో నర్సీపట్నం వెళ్తుండగా కొత్తపల్లి గ్రామ సమీపానికి బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. వ్యానులో ఉన్న వ్యాపారులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లుహైవే జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం చెందాడు. మాకవరపాలేనికి చెందిన బొడ్డు సతీష్ బైక్‌పై వస్తుండగా చినదొడ్డిగల్లు హైవే జంక్షన్ వద్ద అదే మార్గం గుండా వచ్చే లారీ ఢీకొంది. దీంతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో విద్యుత్ షాక్‌నకు గురై వ్యక్తి మరణించాడు. దీంతో గ్రామస్థులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. వివరాలివి. సోమవారం సాయంత్రం కొరుప్రోలు గ్రామానికి చెందిన వేగేసిన సత్యన్నారాయణరాజు తన ఇంటి వద్ద నున్న అరటి చెట్లను తొలగిస్తుండగా, నక్కపల్లి హెటిరో పరిశ్రమకు వెళుతున్న హైటెన్షన్ విద్యుత్ లైనుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో అడ్డురోడ్డు, రేవుపోలవరం రోడ్డులో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయమేర్పడింది. ఈ విద్యుత్ లైను వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు హెటిరో యాజమాన్యంగానీ, ఇటు విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హై టెన్షన్ లైను ఎత్తు పెంచాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న పెదలబుడు సర్పంచ్ దాసుబాబు

'బాబుకు తోడుగా' నిరసన దీక్ష

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: టిడిపి అధినేత చంద్రబాబుపై తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపిన వైసిపి నిరంకుశ పాలనపై వైనంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు అన్నారు. సోమవారం 'బాబుకు తోడుగా 'నిరసన దీక్ష చేపట్టారు. కక్ష, విద్వేషపూరిత పాలన సాగిస్తున్న జగన్‌పై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఓడించి, జగన్‌ను జైలుకు పంపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టిసెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర, వైస్ సర్పంచ్ శెట్టి విజయనిర్మల, సీనియర్ నాయకులు బూర్జ లక్ష్మి, మాజీ వైస్ ఎంపిపి పొద్దు అమ్మన్న, నీరజ లక్ష్మి, వంతల నాగేశ్వరరావు, బోరిబోరి లక్ష్మి, ఇచ్ఛావతి, ఎంపిటిసి కిల్లో కుమార్, స్వాభి, దొన్ను, మాజీ ఎంపిటిసిలు కిల్లో సాయిరాం, స్వామి పాల్గొన్నారు.

7వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

రంపచోడవరం: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా రంపచోడవరంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరాయి. మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్ ఈ దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షల్లో టిడిపి నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, కారం సురేష్‌బాబు, పాము అర్జున, దంతులూరి శివరామరాజు, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, గొర్లె సునీత, వై.నిరంజన్ దేవి, సంగం శ్రీకాంత్, లంక హరిబాబు, పెంటపాటి అనంతమహన్, రాజవొమ్మంగి మండలానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న సునీల్ కుమార్

అత్యధిక లోడింగ్‌లో.. వాల్తేరు రైల్వేకు అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక లోడింగ్ విభాగానికి సంబంధించిన అవార్డును వాల్తేరు రైల్వే డివిజన్ దక్కించుకుంది. ఈ మేరకు న్యూఢిల్లీలోని రైలు భవన్‌లో రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోష్ చేతుల మీదుగా వాల్తేరు డివిజన్ తరపున సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్ మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాల్తేరు డివిజన్ ఇప్పటి వరకు 33.37 మిలియన్ టన్నుల లోడింగ్ సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో లోడ్ చేయబడిన 30.24 మిలియన్ టన్నులతో పోలిస్తే ఇది 10.35 శాతం అధికం. పెరిగిన సరుకు రవాణా లోడింగ్ ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నాటికి వాల్తేరు రైల్వే డివిజన్ రికార్డు స్థాయిలో రూ.3653 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆర్జించిన మొత్తం రూ.3103 కోట్లు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ వాల్తేర్ డివిజన్ బృందానికి, ముఖ్యంగా ఆపరేషన్స్ టీమ్‌కు అభినందనలు తెలియజేశారు. కొత్త రికార్డు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు వాల్తేరు డివిజన్ సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరింత ప్రగతి పథంలో దూసుకుపోతామన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

బస్సు నడిపేందుకు రూట్ మ్యాప్ సర్వే

ప్రజాశక్తి-సీలేరు : పాడేరు నుండి చింతపల్లి, సీలేరు మీదగా భద్రాచలానికి బస్సు నడిపేందుకు ఎపిఎస్ఆర్‌టిసి పాడేరు డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన మంగళవారం రూట్ మ్యాప్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా పాడేరు డిపో నుంచి బయలుదేరి చింతపల్లి సీలేరు మీదగా భద్రాచలం వరకు వెళ్లి, తిరిగి భద్రాచలం, సీలేరు, చింతపల్లి మీదగా పాడేరు వరకు ప్రయాణించి సర్వే చేశారు. నూతనంగా బస్సు సర్వీసును ఈ రూట్లో నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న అన్ని మండలాల ప్రజలకు ఈ బస్సు సర్వీస్ ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశంలో ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా ప్రజల మధ్య మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పాటుతో బిజెపి నాయకత్వంలో వణుకు ప్రారంభమైందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఇండియా పేరును భారత్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే కూటమి ప్రధాన లక్ష్యమని అన్నారు. బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఇటీవల జరిగిన జి 20 సమావేశాలతో మోడీ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకోవాలని చూసినా అదేమీ జరగలేదని పేర్కొంటూ ఇటీవల జరిగిన పరిణామాలను వివరించారు. ఇటీవల రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ప్రేరేపితంతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిందన్నారు. కేంద్రం సహాయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు కూడా మనుగడ సాగించలేదని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సేవలు ఇలాగేనా..

సకాలంలోరాని వైద్యులు - ఇబ్బంది పడుతున్న రోగులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండల కేంద్రం రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో రోగులు మంగళవారం తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మంగళవారం ఉదయం 11.30 వరకు వైద్యులు అందుబాటులో లేరు. దీంతో పలు రుగ్మతలతో ఆసుపత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైద్యుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఆసుపత్రిలో రోజువారి ఓపి ఎక్కువగా ఉన్నా సిబ్బంది కొరత నెలకొంది. ఒకే ఒక స్టాఫ్ నర్సు ఓపిలో ఉన్నవారికి వైద్య సేవలు అందించారు. ఆసుపత్రికి మంగళవారం ఉదయం 7 గంటలకు శాంతినగర్ నుండి జ్వరంతో బాధపడుతున్న మహిళ, గుండె నొప్పితో వచ్చిన వృద్ధుడు మరి చెట్ల అప్పారావు, లక్కవరపాడు నుండి గడ్డి మందు తాగిన మహిళ రాగా, వైద్యులు లేకపోవడంతో వారికి వైద్య సేవలు అందక ఇబ్బంది పడ్డారు. ఈ విషయం స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరి శ్వరరావు దృష్టికి తీసుకు వెళ్ళగా జడ్డంగి పిహెచ్సి నుండి రెండవ వైద్యాధికారి యామిని ప్రియను పంపించారు. ఆమె మధ్యాహ్నం నుండి వైద్య సేవలు అందించారు. ఇక్కడ ఇద్దరు మహిళా వైద్యాధికారులు ఉండగా ఒకరు సెలవుపై వెళ్ళగా, మరొకరు అస్వస్థతతో బాధపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వారం రోజులుగా వైద్యులు సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడం లేదని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

ఈ ఆసుపత్రిలో 24/7 వైద్యులు అందుబాటులో ఉండి నిరంతరం వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఈ పీహెచ్సీ పరిధిలో 26 గ్రామాలు,18 వేల జనాభా ఉంది. ఎనిమిది సబ్ సెంటర్లు ఉన్నాయి. వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య పాఠశాల, గురుకుల పాఠశాలల, కళాశాల విద్యార్థులకు, 40 అంగన్వాడి కేంద్రాలు చిన్నారులకు ఈ హాస్పిటల్ నుండి వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేదల డి పట్టా భూముల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లు

ప్రభుత్వ దగా..!

జగనన్న కాలనీలో భూమి పోయిన పేదలకు మొండిచేయి
ఏళ్లు గడుస్తున్నా దక్కని పరిహారం
లబోదిబోమంటున్న వెదురువాడ డి పట్టాదారులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అక్కడ జగనన్న కాలనీకి తీసుకున్న పేదల భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. ఎకరాకు రూ.18 లక్షలు చొప్పున పరిహారం చెల్లిస్తామని తీసుకున్న పదెకరాల్లో సెంటు భూమికి కూడా ఇంతవరకూ పైసా జమచేయలేదు. అటు ప్రభుత్వమిచ్చిన భూమి చేతిలోలేక, కాలనీకి తీసుకున్న భూమికి పరిహారం అందక లబోదిబోమంటున్నారు జిల్లాలోని అచ్యుతాపురం మండలం వెదురువాడ రెవెన్యూలో జగనన్నకాలనీలో భూములు కోల్పోయిన పేదలు.

2005 జనవరి 21న యలమంచిలిలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా వెదురువాడ రెవెన్యూ సర్వే నెంబర్ 1లో వెదురువాడ ఎస్‌సి కాలనీ, గొల్లల వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, తిమ్మరాజుపేట, మోసయ్యపేట, అచ్యుతాపురానికి చెందిన 142 మంది పేదలు, చేతివృత్తిదారులు డి పట్టాలు అందుకున్నారు. అత్యధిక మందికి ఒక్కొక్కరికీ 70 సెంట్లు చొప్పున, కొద్ది మందికి ఎకరా చొప్పున భూమిపై హక్కు కల్పిస్తూ డి పట్టాతో పాటు పాస్ పుస్తకాన్ని లబ్ధిదారులకు అందజేశారు. విస్తీర్ణం ప్రకారం సరిహద్దులు వేసి భూమి అప్పగిస్తామని అధికారులు చెబితే పట్టాలు పొందిన పేదలంతా దాదాపు నెలరోజులకుపైగా తుప్పలు కొట్టారు. పనిచేసిన కాలానికి కూలి డబ్బులు చెల్లించకపోయినా చేతికి భూమి వస్తుందన్న ఆశతో భూమంతా చదును చేశారు. కానీ ఈ నాటికీ పట్టాదారులెవరికీ ప్రభుత్వం భూమి అప్పగించలేదు. ఎవరి భూమి ఎక్కడవుందో లబ్ధిదారులెవరికీ తెలీదు. అయినా 142 మందికి ఇచ్చిన 102 ఎకరాల్లో దాదాపు 60 ఎకరాల్లో పేదలు జీడితోటలు పెంచుకున్నారు. మిగిలిన వారంతా ఆనాటి నుంచి తమ భూమి ఇతరులపాలు కాకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. గతంలో పేదలకు ఇచ్చిన డి పట్టా భూమిలో సెజ్ నిర్వాసితుల ఇళ్ల స్థలాల కోసం 30 ఎకరాలు తీసుకోవాలని ఎపిఐఐసి భావించింది. ఎకరాకు రూ.14 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి భూమి తీసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వం మారడంతో ఆ నిర్ణయం కార్యరూపం దాల్చలేదు. వైసిపి ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీ కోసం పేదల డి పట్టా భూమి పదెకరాలు తీసుకుంది. అయితే ఎకరాకు రూ.18 లక్షలు చెల్లిస్తామన్న నోటిమాట తప్ప భూములు కోల్పోయిన వారెవరికీ లిఖితపూర్వక హామీగానీ, భూమి తీసుకుంటున్నట్లు నోటీసుగానీ అధికారులు ఇవ్వలేదు. పదెకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ భూమి హక్కుదారులైన డి పట్టాదారులకు ఇంతవరకూ పైసా పరిహారం చెల్లించలేదు. ఎప్పటిలోగా చెల్లిస్తారో కూడా అధికారులు చెప్పడంలేదని బాధితులు 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. పేదలకు పంపిణీ చేసిన డి పట్టా భూమిలో ఇళ్ల స్థలాలకు అనువుగావున్న భూమి తీసుకొని, పరిహారం ఇవ్వకుండా పేదలకు ప్రభుత్వం మొండిచేయి చూపడంపై పలువురు మండిపడుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లను దగ్ధం చేస్తున్న సచివాలయ సిబ్బంది

ప్లాస్టిక్ కవర్ల దగ్ధం

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో సచివాలయ మహిళా పోలీసు, వాలంటీర్లు ప్లాస్టిక్ వ్యాపారి వద్ద నుండి భారీ స్థాయిలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని దగ్ధం చేశారు. మంగళవారం వారపు రోజు ప్లాస్టిక్ వాడే వ్యాపారులపై దాడులు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్నారు. గత మూడు వారాలుగా స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు ఎన్ని, ఈ వారం స్వాధీనం చేసుకున్న కవర్లు ఎన్ని, తగలబెట్టిన కవర్లు ఎన్ని తదితర వివరాలపై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఈవోపిఆర్‌డి వివరణ ఇస్తూ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని సచివాలయంలో భద్రపరిచినట్లు చెప్పారు.

కొనసాగిన ఎంఆర్‌పిఎస్ దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ తొత్తరమూడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆ సంఘం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం తలపెట్టిన దీక్షలు మంగళవారమూ కొనసాగాయి.

తాపీ ధర్మారావు జయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం సంగీత, నృత్య శాఖలు, సమైక్య భారతి, విశాఖ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసెంబ్లీ హాలులో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎయు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఎఎస్‌ఇ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖాధ్యక్షులు ఆచార్య జాలాది రవి, సంగీత నృత్య విభాగాధిపతి అనురాధ, తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

తోపుడు బండ్ల కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జూ పార్కు నుంచి పిఎం.పాలెం స్టేడియం వరకు ఉన్న 40 తోపుడు బండ్లను అటవీశాఖ అధికారులు తొలగించాలని చూడటం అన్యాయమంటూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి తోపుడుబండ్లు, చిన్న చిన్న బడ్డీలు పెట్టుకుని చిల్లర వర్తక కార్మికులుగా 40 కుటుంబాల వారు బతుకుతున్నారన్నారు. తాజాగా అటవీశాఖ అధికారుల దాడులతో వీరి కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నాయన్నారు. తోపుడు బండ్ల కార్మికులకు బతికే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. నేషనల్ స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం రోడ్డు పక్కన బతికే చిల్లర వర్తకులు, కార్మికులకు రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. ఆ విషయాన్ని గుర్తించి హాకర్ జోన్స్ ఏర్పాటు చేయాలన్నారు. జూపార్కు రోడ్డులో ఉన్న తోపుడు బండ్లును తొలగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూ పార్కు తోపుడు బండ్ల కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కిరణ్ కుమార్, ఎస్.లక్ష్మణ్, నాయకులు ఎన్.ధనుంజయరావు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.